జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి :13 సంచిక :56 గురువారం 29-10-2026 పేజీలు:8 వెల:రు 3

https://www.epaperjournalistdiary.com/

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు..

- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు నవీన్ మిట్టల్‌కు
- జీహెచ్ఎంసీతోపాటు మూడు కార్పొరేషన్ల బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు
- పర్యావరణ, అటవీ శాఖకు జయేష్ రంజన్
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్
- వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫారూఖీ
- పలువురు సీనియర్ అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్,

: తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను భారీగా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించడంతోపాటు మరికొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, ఇంధనం, పర్యావరణం, రెవెన్యూ తదితర శాఖల్లో మార్పులు చేపట్టింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు సైబరాబాద్, మల్కాజిగిరి

-మిగతా 2 లో

హైదరాబాద్‌లో నీటి కష్టాలు

రానివ్వొద్దు!

తాగునీటి సరఫరాపై నిరంతర నిఘా ఉండాలి

- రాజధానిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- మురుగునీటి శుద్ధి కేంద్రాలు వంద శాతం సామర్థ్యంతో పనిచేయాలి
- భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీరే వినియోగించాలి
- సచివాలయం, మెట్రో రైలు, ప్రభుత్వ కార్యాలయాలకు శుద్ధి జలాల సరఫరా
- అన్ని శుద్ధి కేంద్రాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలి
- ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్, ట్యాంకర్ల పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు
- నవంబర్ 1 నుంచి కొత్త ఆదేశాలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, తెలంగాణ బ్యూరో ప్రతినిధి:

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి కొరత తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశమున్న నేపథ్యంలో ప్రతి నీటిబొట్టును సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. నగరానికి తాగునీటిని అందించే రిజర్వాయర్లలో నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని, సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ జలమండలి ప్రాంగణంలో బుధవారం తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరు, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. నగర ప్రధాన ప్రాంతాల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, నీటి శుద్ధిలో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. సచివాలయం,

-మిగతా 2 లో



02

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు!

- మోదీ, అమిత్ షాలపై రాహుల్‌గాంధీ ఫైర్..!
- భారత వ్యాపార రంగం వారి ఆటవస్తువు కాదంటూ ధ్వజం
- భయంతో నోరు మెదపని పారిశ్రామికవేత్తలంటూ విమర్శ
- టాటా సన్స్ ఛైర్మన్ పునర్నియామకంపై ముదిరిన వివాదం
- బోర్డు తీర్మానాన్ని సవాల్ చేసిన నోయెల్ టాటా
- రాహుల్‌కు ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదన్న బీజేపీ నేత

02

బ్యాలెట్‌తో ఎన్నికలు.. కాంగ్రెస్‌కు సున్నా!

- నాలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం
- 28 స్థానాలకు ఎన్నికలు.. 12 చోట్ల పోటీ చేసి ఒక్కటీ గెలవని హస్తం
- గతంలో గెలిచిన నాలుగు స్థానాలనూ కోల్పోయిన కాంగ్రెస్
- అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ దక్కని విజయం
- ఈవీఎంలపై ఆరోపణలకు ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు
- బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగినా గెలవలేదంటూ ఎద్దేవా
- ఎక్స్‌లో 'మోనోకిల్' ఎమోజీతో మోదీ వ్యంగ్య పోస్టు

కన్నీటి పర్యంతమైన ముఖేశ్ అంబానీ!

- ముగ్గురు పిల్లలను చూసి భావోద్వేగానికి గురైన పారిశ్రామిక దిగ్గజం
- జియో మార్కెట్ లిస్టింగ్ కార్యక్రమంలో ఉద్వేగభరిత క్షణాలు
- ధీరూభాయ్ అంబానీకి నివాళులర్పించిన ఆకాశ్, ఇషా, అనంత్
- పిల్లల ప్రసంగాల సమయంలో కన్నీళ్లు తుడుచుకున్న ముఖేశ్

02

పైలట్ స్మిత్ మచ్చర్‌కు అరుదైన గౌరవం..

- 'ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ II'తో సత్కారం
- విమానంలో కోపైలట్ దాడిని ధైర్యంగా ఎదుర్కొన్న కెప్టెన్
- తీవ్ర రక్తస్రావమైనా చెక్కుచెదరని ధైర్యం
- 170 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కాపాడిన పైలట్
- విమాన సిబ్బందికీ యూఏఈ ప్రభుత్వ ప్రత్యేక సత్కారం
- దుబాయ్ యువరాజు చేతుల మీదుగా పురస్కారం అందజేత

02

ఏపీలో తుఫాను

విలయం

గోదావరి జిల్లాలు అతలాకుతలం!

- యానాం సమీపంలో తీరం దాటిన పెనుతుఫాను
- గంటకు 150 కిలోమీటర్ల వేగంతో విరుచుకుపడిన పెనుగాలులు
- ఉప్పాడలో సముద్రం ఉగ్రరూపం.. కోనసీమలో అలల బీభత్సం
- కూలిన భారీ వృక్షాలు.. ధ్వంసమైన రహదారులు, ఇళ్లు
- కోనసీమలో 8 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- 50 సబ్‌స్టేషన్ల పరిధిలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- 13 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించిన అధికారులు
- పంటలు, మత్స్యకారుల బోట్లు, వలలకు తీవ్ర నష్టం
- పునరుద్ధరణ పనుల్లో రెండు వేల మందికిపైగా సిబ్బంది

02

ప్రకృతి ప్రకోపానికి గోదావరి జిల్లాలు విలవిల్లాడాయి. ఆకాశం చిల్లులు పడిందా అన్నట్లు కుండపోత వర్షాలు.. భూమిని పెకలించేలా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు.. ఊళ్లపైకి దూసుకొచ్చిన సముద్రపు అలలు.. కళ్లముందే కుప్పకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన పంటలు.. చీకట్లో మగ్గిన పల్లెలు.. ఎటుచూసినా విధ్వంస దృశ్యాలే! యానాం సమీపంలో తీరం దాటిన 'ఆర్బ్' తుఫాను కాకినాడ, కోనసీమ జిల్లాలను అతలాకుతలం చేసింది. వేలాది కుటుంబాలను నిరాశ్రయులను చేస్తూ, జనజీవనాన్ని స్తంభింపజేసింది. ఉప్పెడ తీరంలో సముద్రం ఉగ్రరూపం దాల్చగా, కోనసీమలో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వేలాది మంది పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. తుఫాను తీరం దాటినా.. అది మిగిల్చిన విధ్వంసం నుంచి కోలుకునేందుకు గోదావరి జిల్లాలు పోరాడుతున్నాయి.

6

వైసీపీ 'ఓటు బ్యాంక్' ఇంకా 'తగ్గాలి'..

- రాష్ట్రం బాగుపడాలంటే అదే మార్గం...సీఎం చంద్రబాబు
- 45 వేల మంది నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యంగా పనిచేయాలని చంద్రబాబు పిలుపు
- రెబల్స్‌గా పోటీ చేస్తే సహించేది లేదు, అది కూటమి ధర్మానికి విరుద్ధం
- సీట్లు రాని వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ
- 'గొడ్డలి పార్టీ' కుట్రలను ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచన
- డబుల్ ఇంజిన్ సర్కారును ట్రిపుల్ ఇంజిన్‌గా మార్చడమే లక్ష్యం

06

తుపాను బాధితులకు 'భారీ' 'ప్యాకేజి' ప్రకటించిన చంద్రబాబు

- అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీ
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇళ్ల నష్టానికి ఆర్థిక సాయం
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ. 35,000 వరకు పరిహారం
- తుఫాను నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక, కేంద్ర బృందాన్ని కోరిన సీఎం
- ప్రతీ బాధితుడికి పారదర్శకంగా సాయం అందిస్తామని సిఎం హామీ

ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ

- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- నవంబర్ 3కి బదులుగా 5వ తేదీన పోలింగ్
- నవంబర్ 5కి బదులుగా 7వ తేదీన ఓట్ల లెక్కింపు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు తేదీలను కూడా రెండు రోజుల పాటు వెనక్కి జరిపింది.

వివరాల్లోకి వెళితే..

గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, తాజా నిర్ణయంతో పోలింగ్ తేదీని నవంబర్ 5వ తేదీకి మార్చారు. అదేవిధంగా, నవంబర్ 5న చేపట్టాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్పులకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించనప్పటికీ, పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ముందుగా ప్రకటించిన తేదీలతో పోలిస్తే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు రెండూ రెండు రోజుల ఆలస్యంగా జరగనున్నాయి. ఈ మార్పులను అభ్యర్థులు, అధికారులు, ప్రజలు గమనించాలని ఎన్నికల సంఘం సూచించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కొత్త తేదీలకు అనుగుణంగా అధికారులు సవరించుకుంటున్నారు

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..

మొదటి తరువాయి

కార్పొరేషన్ల బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు. రెవెన్యూ శాఖ పరిధిలోని దేవాదాయ శాఖకు శైలజ రామయ్యర్‌ను నియమించగా, క్రీడలు, వారసత్వ శాఖ బాధ్యతలను ఎ.వాణి ప్రసాద్‌కు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను రాహుల్ బొజ్జాకు కేటాయించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె.ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫారూఖీ నియమితులయ్యారు. మరోవైపు హైదరాబాద్ నగర పరిపాలనకు సంబంధించిన కీలక బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు అప్పగించారు. జీహెచ్ఎంసీతోపాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు. మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు కేటాయించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణను నియమించారు. విద్యుత్ రంగానికి సంబంధించిన టీజీఎస్‌పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి.పాటిల్‌కు అప్పగించారు. కీలక శాఖల్లో సమన్వయాన్ని పెంచడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాల అమలును మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. కొత్తగా నియమితులైన అధికారులు తమకు కేటాయించిన శాఖల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

హైదరాబాద్‌లో నీటి కష్టాలు

రానివ్వొద్దు!

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి కార్యాలయం, మెట్రో రైలు ప్రాంగణాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణతోపాటు ఉద్యానవనాలు, రహదారుల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని తెలిపారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని తప్పనిసరి చేసే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేటు శుద్ధి కేంద్రాలను ప్రోత్సహించడంతోపాటు డేటా సెంటర్లకు కూడా శుద్ధి జలాలను అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించి, అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని సూచించారు. వీటి పనితీరును హైడ్రా నిరంతరం పర్యవేక్షించాలని, శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్ల కదలికలను గుర్తించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. శుద్ధి కేంద్రాల నిర్వహణలో సౌర విద్యుత్ వినియోగ అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం 26 శుద్ధి కేంద్రాల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తూ నామమాత్రపు రుసుము వసూలు చేస్తున్నామని జలమండలి అధికారులు సీఎంకు వివరించారు. శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించిన కొత్త ఆదేశాలను నవంబర్ 1 నుంచి అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కన్నీటి పర్యంతమైన ముఖేశ్ అంబానీ!

- ముగ్గురు పిల్లలను చూసి భావోద్వేగానికి గురైన పారిశ్రామిక దిగ్గజం
- జియో మార్కెట్ లిస్టింగ్ కార్యక్రమంలో ఉద్వేగభరిత క్షణాలు
- ధీరూభాయ్ అంబానీకి నివాళులర్పించిన ఆకాశ్, ఇషా, అనంత్
- పిల్లల ప్రసంగాల సమయంలో కన్నీళ్లు తుడుచుకున్న ముఖేశ్



ముంబై

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలను చూసి భావోద్వేగానికి గురైనట్లు వార్తలు వెలువడ్డాయి. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సందర్భంగా నిర్వహించినట్లు చెబుతున్న కార్యక్రమంలో ఆకాశ్ అంబానీ, ఇషా అంబానీ, అనంత్ అంబానీ తమ తాత ధీరూభాయ్ అంబానీకి నివాళులర్పించిన సమయంలో ముఖేశ్ అంబానీ కన్నీళ్లను ఆపుకోలేకపోయినట్లు కథనం పేర్కొంది. కుటుంబ వ్యాపార సామ్రాజ్యాన్ని తదుపరి తరం ముందుకు తీసుకెళ్తోందన్న భావోద్వేగంతో ఆయన పలుమార్లు కన్నీళ్లు తుడుచుకున్నట్లు తెలిపింది. ధీరూభాయ్ అంబానీ ఆశయాలు, కుటుంబం చేసిన త్యాగాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి పిల్లలు మాట్లాడుతున్న సమయంలో ముఖేశ్ అంబానీ తీవ్ర ఉద్వేగానికి లోనైనట్లు పేర్కొంది. ఈ భావోద్వేగ ఘటన అక్టోబర్ 28న ముంబైలో జరిగిన జియో ప్లాట్‌ఫామ్స్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్ కార్యక్రమంలో చోటుచేసుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు ధ్రువీకరించాయి.

పైలట్ స్మిత్ మచ్చర్‌కు అరుదైన గౌరవం..

-'ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ II'తో సత్కారం
-విమానంలో కోపైలట్ దాడిని ధైర్యంగా ఎదుర్కొన్న కెప్టెన్
-తీవ్ర రక్తస్రావమైనా చెక్కుచెదరని ధైర్యం
-170 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కాపాడిన పైలట్
-విమాన సిబ్బందికీ యూఏఈ ప్రభుత్వం ప్రత్యేక సత్కారం
-దుబాయ్ యువరాజు చేతుల మీదుగా పురస్కారం అందజేత

న్యూఢిల్లీ,

ఫ్లైదుబాయ్ విమానం పైలట్ స్మిత్ మచ్చర్ కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సర్కారు నుంచి అరుదైన గౌరవం దక్కింది. విమానం కూల్చివేత ప్రయత్నాన్ని వీరోచితంగా అడ్డుకుని ప్రయాణికుల ప్రాణాలు కాపాడినందుకు యూఏఈ అత్యున్నత పురస్కారం ఇచ్చింది. 'ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ ××' పురస్కారాన్ని ప్రకటించింది. మచ్చర్‌తోపాటు ప్రమాద సమయంలో విమానంలో ఉన్న ఫ్లైట్ సిబ్బందినీ యూఏఈ సత్కరించింది.యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తరఫున యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ ఈ అవార్డును మచ్చర్‌కు ఇచ్చారు. కాగా సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన విమానం కాక్‌పిట్‌లో పైలట్ స్మిత్ మచ్చర్‌పై కోపైలట్ దాడి చేశాడు. ఈ ఘటన ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తీవ్ర రక్తస్రావమై కంటిచూపు మసకబారినా కెప్టెన్ ధైర్యాన్ని కోల్పోకుండా 170 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కాపాడాడు.

బ్యాలెట్‌తో ఎన్నికలు.. కాంగ్రెస్‌కు సున్నా!

- నాలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం
- 28 స్థానాలకు ఎన్నికలు.. 12 చోట్ల పోటీ చేసి ఒక్కటీ గెలవని హస్తం
- గతంలో గెలిచిన నాలుగు స్థానాలనూ కోల్పోయిన కాంగ్రెస్
- అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ దక్కని విజయం
- ఈవీఎంలపై ఆరోపణలకు ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు
- బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగినా గెలవలేదంటూ ఎద్దేవా
- ఎక్స్‌లో 'మోనోకిల్' ఎమోజీతో మోదీ వ్యంగ్య పోస్టు



న్యూఢిల్లీ,

ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్రమోదీ వ్యంగ్యంగా స్పందించారు. ఎందుకంటే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి బీజేపీ అక్రమంగా ఎన్నికల్లో గెలుస్తోందని కాంగ్రెస్ పార్టీ తరచూ ఆరోపిస్తున్నది. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని, కాంగ్రెస్ పార్టీ ఖాతానే తెరువలేదుగా అని ప్రధాని ఎక్స్‌లో సెటైరికల్ పోస్టు చేశారు. ఈ పోస్టుకు 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు.కాగా ఇటీవల ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. కానీ ఒక్క స్థానంలో కూడా గెలువలేదు. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా చేజారిపోయాయి. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ తరచూ ఆరోపణలు చేస్తున్నది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవాచేశారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు!

-మోదీ, అమిత్ షాలపై రాహుల్‌గాంధీ ఫైర్..!
- భారత వ్యాపార రంగం వారి ఆటవస్తువు కాదంటూ ధ్వజం
- భయంతో నోరు మెదపని పారిశ్రామికవేత్తలంటూ విమర్శ
- టాటా సన్స్ ఛైర్మన్ పునర్నియామకంపై ముదిరిన వివాదం
- బోర్డు తీర్మానాన్ని సవాల్ చేసిన నోయెల్ టాటా
- రాహుల్‌కు ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదన్న బీజేపీ నేత

న్యూఢిల్లీ,

దేశీయ పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక సంస్థను దెబ్బతీస్తున్నా ఇతర వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మోదీ, అమిత్ షాల చర్యల కారణంగా అన్యాయానికి గురవుతున్న వారికి న్యాయం జరిగేలా తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాల్ చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, పునర్నియామక ప్రక్రియలో నిబంధనలను పాటించలేదని అక్టోబర్ 26న రాసిన లేఖలో నోయెల్ టాటా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ పరిణామాలు టాటా గ్రూప్ అంతర్గత వ్యవహారాలపై చర్చకు దారితీశాయి. ఇదే సమయంలో రాహుల్ గాంధీ నేరుగా ప్రధాని మోదీ, అమిత్ షాలపై ఆరోపణలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే టాటా గ్రూప్ అంతర్గత వివాదంలో కేంద్ర ప్రభుత్వ జోక్యానికి సంబంధించిన ఆధారాలను రాహుల్ తన వ్యాఖ్యల్లో వెల్లడించలేదు. మరోవైపు రాహుల్ ఆరోపణలను బీజేపీ నేత సీఆర్ కేశవన్ తప్పుబట్టారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దీంతో టాటా గ్రూప్ వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ మధ్య మరో రాజకీయ వివాదానికి దారితీసింది.

ఏపీలో తుఫాను విలయం..

- యానాం సమీపంలో తీరం దాటిన పెనుతుఫాను
- గంటకు 150 కిలోమీటర్ల వేగంతో విరుచుకుపడిన పెనుగాలులు
- ఉప్పాడలో సముద్రం ఉగ్రరూపం.. కోనసీమలో అలల బీభత్సం
- కూలిన భారీ వృక్షాలు.. ధ్వంసమైన రహదారులు, ఇళ్లు
- కోనసీమలో 8 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- 50 సబ్‌స్టేషన్ల పరిధిలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- 13 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించిన అధికారులు
- పంటలు, మత్స్యకారుల బోట్లు, వలలకు తీవ్ర నష్టం
- పునరుద్ధరణ పనుల్లో రెండు వేల మందికిపైగా సిబ్బంది

కాకినాడ,

ఉవ్వెత్తున ఎగసిపడిన సముద్రపు అలలు.. చెట్లను పెకలించి, విద్యుత్ స్తంభాలను నేలకూల్చిన పెనుగాలులు.. కుండపోత వర్షాలతో జలమయమైన రహదారులు.. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారంలో మునిగిన గ్రామాలు.. నేలవాలిన పంటలు.. నిరాశ్రయులైన కుటుంబాలు.. వెరసి పెనుతుఫాను గోదావరి జిల్లాలను అతలాకుతలం చేసింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన ప్రకృతి ప్రకోపం బుధవారం తెల్లవారుజామున మరింత ఉగ్రరూపం దాల్చింది. అందిన వివరాల ప్రకారం యానాం సమీపంలో తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచగా, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగాన్ని తాకాయి. తుఫాను ప్రభావంతో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ఉప్పాడ తీరంలో సముద్రపు అలలు రహదారులపైకి దూసుకురావడంతో కాకినాడ బీచ్ రహదారి తీవ్రంగా దెబ్బతింది. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోగా, గుడిసెలు, పెంకుటిళ్లు ధ్వంసమయ్యాయి. చేతికొచ్చిన పంటలు నేలవాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మత్స్యకారుల బోట్లు, వలలు దెబ్బతిన్నాయి. కోనసీమ జిల్లాలో 8 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 50 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేశ్‌కుమార్ వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు రెండు వేల మందికిపైగా సిబ్బందిని రంగంలోకి దించగా, 10 వేల కొత్త స్తంభాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కాకినాడ రూరల్‌లో సుమారు 300 విద్యుత్ స్తంభాలు, 60 ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. కాట్రేనికోన మండలంలో 252 విద్యుత్ స్తంభాలు, తొమ్మిది ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు కోనసీమ జిల్లాలోని తీర, లోతట్టు ప్రాంతాల నుంచి 13 వేల మందిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించారు. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో జనరేటర్ల సాయంతో తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. రహదారులపై పడిన చెట్ల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతులు, తాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు పంటలు, బోట్లు, వలలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, రహదారులు, విద్యుత్ శాఖల సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలను వేగవంతం చేశారు.

ఒడిశావైపు అర్నబ్

-తమిళనాడులోనూ తీవ్ర ప్రభావం
-సురక్షిత ప్రాంతాలకు లక్ష మంది
-పలు విమానాలు, రైళ్లు రద్దు
-ఒడిశాలో కూలిన వంతెన
-పలు గ్రామాలకు రాకపోకలు బంద్

న్యూఢిల్లీ:

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను ఏపీ నుంచి ఒడిశావైపు మళ్లింది. తమిళనాడులోనూ పంజా విసిరింది. జనజీవనాన్ని స్తంభింపజేసింది. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిశాయి. ఒడిశాలో చెట్లు కూలి రహదారులు మూసుకుపోగా, కొన్ని ప్రాంతాల్లో వంతెన కూలడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 73 మంది మహిళలకు సురక్షితంగా ప్రసవాలు జరిగాయి. మరోవైపు చెన్నై విమానాశ్రయంలో 12 విమానాలను రద్దు చేయగా, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఒడిశాలోని గజపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పెద్దపెద్ద చెట్లు నేలకూలడంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నదులు, వాగుల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఆర్.ఉదయగిరి బ్లాక్‌లోని కైరడిప్ వాగులో నీటిమట్టం పెరగడంతో కానకటప్పురుణాపాటి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో సుమారు 30 ప్రాంతాల్లో చెట్లు కూలి రహదారులు మూసుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో దాదాపు 25 ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మోహన ప్రాంతంలోని గుండరీగుడా వంతెన కూలిపోవడంతో నదికి అవతలి వైపున ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గర్భిణుల తరలింపు

ఇక రాయగడ జిల్లాలో తుపాను ముప్పును దృష్టిలో ఉంచుకుని యంత్రాంగం అప్రమత్తమైంది. రానున్న 15 రోజుల్లో ప్రసవ తేదీ ఉన్న 234 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాల్లోని మాతా గృహాలు, ఆస్పత్రులకు తరలించారు. ఒక్కరోజులోనే 73 మంది మహిళలకు ప్రసవాలు జరిగాయని, తల్లులు, శిశువులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ముట్టుకుణి గ్రామం నుంచి సుమారు 46 నుంచి 48 మందిని జయపంగ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆశ్రయ కేంద్రానికి తరలించారు. వరద ముప్పు పెరిగితే గుణుపూర్ ప్రాంతంలోని మరికొన్ని గ్రామాల ప్రజలను కూడా ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేశారు.

సురక్షిత ప్రాంతాలకు లక్ష మంది

తుపాను ప్రభావం దక్షిణ ఒడిశాలోని గజపతి, గంజాం, రాయగడ, కోరాపుట్, నబరంగ్‌పూర్, మల్కాన్‌గిరి జిల్లాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఆరు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేశ్ పూజారి వెల్లడించారు. గంజాం, గజపతి, రాయగడ, నబరంగ్‌పూర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

చెన్నైలో పలు రైళ్లు, విమానాలు రద్దు

ఇక తుపాను ప్రభావంతో చెన్నై విమానాశ్రయంలో 12 విమానాలను రద్దు చేశారు. విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి నగరాల నుంచి చెన్నైకి వచ్చే ఆరు విమానాలతో పాటు చెన్నై నుంచి ఆయా నగరాలకు వెళ్లాల్సిన మరో ఆరు విమానాలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపాను కారణంగా పలు రైళ్లను కూడా రద్దు చేయడంతో పాటు మరికొన్ని మార్గాల్లో మార్పులు చేశారు. భువనేశ్వర్-జగదల్పూర్ హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌ను రాయగడ వరకు పరిమితం చేయడంతో పాటు తిరుగు ప్రయాణంలోనూ మార్పులు చేశారు. తుపాను ప్రభావంతో చెన్నైలోని ఎన్నూర్, పట్టణపాక్కం, బెసెంట్ నగర్ తీర ప్రాంతాల్లో సముద్ర అలలు ఎగసిపడ్డాయి. ఎన్నూర్ లో ఐదు అడుగులకు పైగా ఎత్తులో వచ్చిన అలలు తీర రక్షణ గోడలను దాటి రహదారులపైకి దూసుకొచ్చాయి.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఎమ్మెల్యే సొంత మండలానికే
కరువు గుర్తింపు లేదా?

-బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సూటి ప్రశ్న

-వీర్లపల్లి శంకర్ సొంత మండలం నందిగామపై అధికారుల నివేదికలేంటి?

-పక్క మండలాలకు కరువు.. ఎమ్మెల్యే సొంత మండలానికి ఎందుకు లేదు?

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ)
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత మండలమైన నందిగామలో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఆ మండలానికి చోటు కల్పించకపోవడంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు, షాద్‌నగర్ సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నలు సంధించారు. ఎమ్మెల్యే సొంత మండలంలోనే రైతులు కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్నారని, అయినప్పటికీ అధికారులు కరువు లేదన్నట్లు నివేదికలు సమర్పించడం వెనుక కారణమేంటని ఆయన నిలదీశారు.

ఎమ్మెల్యే సొంత మండలానికే ఈ పరిస్థితి ఎందుకు?
షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూర్, ఫరూఖ్‌నగర్, కేశంపేట, చౌదరిగూడ మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, కరువు ప్రభావం ఉందని చెబుతున్న కొందుర్గుతో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత మండలమైన నందిగామను జాబితాలో చేర్చకపోవడం ఏమిటని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే సొంత మండలంలో కరువు పరిస్థితులను అధికారులు గుర్తించలేకపోయారా? లేక క్షేత్రస్థాయి పరిశీలనలో లోపాలు జరిగాయా? అని నిలదీశారు. నందిగామ మండలంలో ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు సాగు చేశారు? ఎల్‌నినో ప్రభావంతో ఎక్కడెక్కడ పంటలు ఎండిపోయాయి? భూగర్భ జలాలు ఎంతమేర అడుగంటాయి? విద్యుత్ సమస్యలు సాగుపై ఎలాంటి ప్రభావం చూపాయి? అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారా అని ప్రశ్నించారు. రైతుల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నివేదికలు సమర్పించడం వల్లే నందిగామ మండలానికి కరువు మండలాల జాబితాలో చోటు దక్కలేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.

పక్కనే ఉన్న మండలాల్లో కరువు.. నందిగామలో లేదా?
కొత్తూర్, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు గుర్తించినప్పుడు, వాటి మధ్యలో ఉన్న నందిగామ మండలంలో కరువు లేదని ఎలా నిర్ధారించారని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ఒకే నియోజకవర్గంలో, పక్కపక్కనే ఉన్న మండలాల పరిస్థితుల్లో ఇంత వ్యత్యాసం ఎలా వచ్చిందో అధికారులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత మండలమైన నందిగామను కరువు మండలంగా ప్రకటించకపోవడంపై ఆయన ప్రత్యేకంగా స్పందిస్తూ, రైతుల పరిస్థితిని గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నిర్లక్ష్యం జరిగిందా, తప్పుడు నివేదికలు సమర్పించారా, లేక ఇతర కారణాలున్నాయా అన్నది స్పష్టం చేయాలని కోరారు.
నందిగామ మండలంలోని వాస్తవ కరువు పరిస్థితులను మరోసారి సమగ్రంగా పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేసి, అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

కాలుష్యపు నీరు..కాటేస్తుంది సారూ..

పచ్చని పల్లెలకు పరిశ్రమ పొగసెగ..

చెరువుల్లోకి చేరి చేపలను చంపుతున్న నీరు..

కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఓం శివశక్తి పరిశ్రమ

ఆందోళనకు దిగిన కందివనం పరిసర గ్రామాల వాసులు..

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
ఆ పరిశ్రమలోకి అడుగుపెడితే ఎక్కడ చూసినా విపరీతమైన పొగ దుమ్ము, ధూళి కనిపిస్తాయి.. మరోవైపు కాలుష్యపు నీటి కాలువలు గ్రామీణ ప్రాంతంలో ఉన్న చెరువుల వైపు చేరుతుంటాయి.. విపరీతమైన పొగ గ్రామస్తుల పంట పొలాలను కమ్ముకుంటుంది.. పాఠశాల విద్యార్థులను సైతం ఈ పొగ భయపెడుతోంది.. ఫరూక్ నగర్ మండలం కందివనం గ్రామ పరిధిలోని ఓం శివశక్తి పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యం ఇది. ఈ కాలుష్యం కారణంగా సమీపంలో ఉన్న కందివనం గ్రామం తో పాటు, చౌలపల్లి, గుండె గాని తండ, పిట్టలగడ్డ తండాలు ఈ పరిశ్రమ కారణంగా పొగబారిపోయాయి. ఈ పరిశ్రమ ద్వారా వెదజల్లే కాలుష్యపు నీరు నేరుగా వెళ్లి కందివనం గ్రామ సమీపంలోని చెరువులో కలుస్తుంది. ఇక దట్టమైన పొగను తన రాజ్యాంగా బయటికి వదులుతుండడంతో పంటచేలు పూర్తిగా నాశనం అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. పరిశ్రమ ముందు టెంట్ వేసి ధర్నా నిర్వహించారు. పరిశ్రమ నిర్వాహకులు వెంటనే స్పందించి పరిశ్రమలు మూసివేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ పరిశ్రమ కారణంగా ఆరోగ్యాలు పూర్తిగా పాడైపోతున్నాయని, ఎన్నిసార్లు హెచ్చరించినా పరిశ్రమ నిర్వాహకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దీనిపై స్పందించకుంటే ఈ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, పరిశ్రమలు మూసివేసే దాకా ఈ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ జెమిని అమ్రు నాయక్, డిప్యూటీ సర్పంచ్ విజయ యాదగిరి, మాజీ సర్పంచ్ శివ జ్యోతి, మాజీ డిప్యూటీ సర్పంచ్ గోపాల్ గౌడ్,గ్రామ పెద్దలు శంకరయ్య గౌడ్, ఆంజనేయులు, వార్డు సభ్యుడు మల్లేష్, మహేష్ మహేందర్, చింతకింది చంద్రయ్య, వీరు నాయక్, మహిళలు, యువకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కరువు కష్టాలు కనిపించలేదా?

కొందుర్గు, నందిగామకు కరువు మండలాల జాబితాలో చోటేదీ?

పంటలు ఎండిపోతున్నా.. భూగర్భ జలాలు అడుగంటినా గుర్తించరా?

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి రైతులకు న్యాయం చేయాలి

కొందుర్గు మండల మాజీ వైస్ ఎంపీపీ మంగులాల్ నాయక్ డిమాండ్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 2026 ఖరీఫ్ కరువు మండలాల జాబితాలో రంగారెడ్డి జిల్లాలో 18 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో కొత్తూర్, ఫరూక్‌నగర్, చౌదరిగూడ, కేశంపేట మండలాలకు కరువు మండలాల జాబితాలో చోటు కల్పించారు. అయితే నందిగామ, కొందుర్గు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నందిగామ, కొందుర్గు మండలాలను కరువు మండలాల జాబితాలో ఎందుకు చేర్చలేదని వారు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారా? లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొందుర్గు మండల మాజీ వైస్ ఎంపీపీ మంగులాల్ నాయక్ స్పందించారు. కొందుర్గు మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా అనేక పంటలు దెబ్బతిన్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు ఇన్ని కష్టాలు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో కొందుర్గు మండలాన్ని కరువు మండలంగా ఎందుకు ప్రకటించలేదో అర్థం కావడం లేదన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాలపై మరోసారి సమగ్రంగా పరిశీలన జరిపి, అర్హత ఉన్న మండలాలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా స్పందించి కొందుర్గు, నందిగామ మండలాల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంగులాల్ నాయక్ డిమాండ్ చేశారు.

టెలికాం నగర్ కాలనీ వాసులు కాలనీ లో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై గాంధీ కి వినతిపత్రం.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టెలికాం నగర్ కాలనీ వాసులు కాలనీ లో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సీనియర్ నాయకులు శ్రీ గణేష్ ముదిరాజు గారి ఆధ్వర్యంలో పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని వివేకానంద నగర్ లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది.
ఈ సందర్భంగా టెలికాం నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ మా కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేశారు అని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, మీకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అని , కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని, రోడ్ల మరమ్మత్తులు చేయాలని, పార్క్ లను అభివృద్ధి చేయాలని పియెసి చైర్మన్ గాంధీ కి వినతిపత్రం ద్వారా తెలియచేయడం జరిగినది.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. టెలికాం నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని, టెలికాం నగర్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, టెలికాం నగర్ కాలనీ అభివృద్ధికి నా వంతు సహా య సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, అదేవిదంగా అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని,అవసరమున్న చోట్ల రోడ్ల ను పునరుదరిస్తామని, ప్రజలకు సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని, టెలికాం నగర్ కాలనీలో పార్క్ లను అభివృద్ధి చేస్తామని, పార్క్ లను సుందర శోభిత వనాలు గా తీర్చిదిద్దుతామని, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, మరియు గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామని తెలియచేశారు .ఈ కార్యక్రమంలో టెలికాం నగర్ వాసులు సుస్మిత, రామారావు, దత్తు, నరేంద్ర,రాంబాబు, గంగ, కోటేశ్వరరావు, కృష్ణా రావు, నరేంద్ర ,విజయలక్ష్మి, సుభాష్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

దర్శి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో టాస్క్ ఫోర్స్, పోలీసుల దాడులు

-3, బెల్ట్ షాపులపై రైడ్స్, మద్యం సీసాలు స్వాధీనం

దర్శి, ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, ఒంగోలు టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జ్ సి.ఐ. కమలాకర్ గారి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఎస్సై చెంచయ్య మరియు సిబ్బంది జిల్లాలో ఉక్కుపాదం మోపారు. బుధవారం మెదరమెట్ల, తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తున్న 3 బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించి, వారి వద్ద నుండి అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కొరిసపాడు మండలం, మేదరమెట్ల గ్రామంలో పాత గుంటూరు లోని బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి, ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 9 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.కొరిసపాడు మండలం, మేదరమెట్ల గ్రామం హైవే లో ఒక వ్యక్తి వద్ద అనధికారికంగా విక్రయించడానికి ఉంచిన 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాలలో పట్టుబడిన మొత్తం అక్రమ మద్యాన్ని, నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మేదరమెట్ల పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేశారు. తాళ్లూరు మండలం, మల్కాపురం పంచాయతీ యానాది సంఘంలో ఒక వ్యక్తి వద్ద అనధికారికంగా విక్రయించడానికి ఉంచిన 14 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్లో అప్పగించారు.

అద్దంకి చెక్ పోస్ట్ లను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

అద్దంకి,ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
బుధవారం ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఎన్జీ.పాడు చెక్ పోస్ట్ మరియు అద్దంకి చెక్ పోస్ట్ లను తనిఖీ చేసారు. అద్దంకి తదితర ప్రాంతాలలో చెక్ పోస్ట్ ల ఆకస్మిక తనిఖీ చేశారు.ఎన్జీ పాడు గ్రామంలో మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ అమలు విధానాన్ని పరిశీలించి సంబంధిత ఎఫ్.ఎస్టీ మరియు ఎంసిసి టీంలకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎఫ్ ఎస్ టి టీములు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, ఎం సి సి టీములతో స్థానిక ఎన్జీ పాడు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. చెక్పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని , స్టాటిక్ సర్వేలెన్సీ టీములు తనిఖీలలో భాగంగా ఏమైనా కేసులు బుక్ చేసినట్లయితే సంబంధిత రిపోర్టులను సంబంధిత పరిశీలకులకు అందించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి) నిబంధనలను తూచా తప్పకుండా అమలు అయ్యేలా చూడాలన్నారు. వాహనాలను తనిఖీ చేసేటప్పుడు నిశితంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. వాహనాలలో అనుమానాస్పద వస్తువులు కానీ నగదు కానీ తగిన అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నట్లయితే సదరు విషయాలను సంబంధిత అధికారులకు తెలపాలని అదేవిధంగా కేసులు బుక్ చేయాలని ఆమె తెలిపారు.

కొందుర్గులో నదులున్నాయా? కాలువలున్నాయా? మరి కరువు మండలంగా ఎందుకు ప్రకటించరు?

-అప్పుల ఊబిలో రైతులు.. ఆదుకునే వారేరీ? కొందుర్గుకు కరువు సాయం అందించాలి!

-కొందుర్గు రైతుల గోస వినండి.. తక్షణమే కరువు మండలంగా ప్రకటించండి! -- పసుపుల ప్రశాంత్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) : కరువు మండలాల జాబితాలో కొందుర్గు మండలానికి చోటు కల్పించకపోవడం పట్ల పసుపుల ప్రశాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి, పంటలు ఎండిపోయి, పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో కొందుర్గు మండలాన్ని కరువు మండలాల జాబితా నుంచి ఎలా మినహాయిస్తారని ఆయన ప్రశ్నించారు.కొందుర్గు మండలం ఏమైనా ధనిక మండలమా? ఇక్కడి రైతులంతా లక్షాధికారులా? రైతుల పొలాల్లో పంటలు ఎండిపోతుంటే, బోర్లలో నీళ్లు అడుగంటిపోతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా? మన మండలంలో నదీ జలాలు, సాగునీటి కాలువలు, పెద్ద చెరువుల ద్వారా నిరంతర సాగునీటి సౌకర్యం ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు.ఇప్పటికే సుమారు 10 శాతం మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అందకపోవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పంట నష్టాలు, మరోవైపు పెరిగిన నిత్యావసర ధరలు, అప్పుల భారం రైతు కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు.పంటలు పండక రైతు కన్నీరు పెడుతుంటే, కరువు జాబితాలో పేరు లేకపోవడం రైతులకు మరో అన్యాయం కాదా? రైతులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం వారి వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొందుర్గు మండలంలోని క్షేత్రస్థాయి పరిస్థితులను తక్షణమే పరిశీలించి, పంట నష్టం, భూగర్భ జలాల పరిస్థితి, రైతుల ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని కొందుర్గు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి. అర్హులైన రైతులకు కరువు సహాయం అందించి, రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి.రైతుల కన్నీళ్లకు విలువ లేదా? కొందుర్గు రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. రైతుల పక్షాన పోరాడుతాం! అని పసుపుల ప్రశాంత్ స్పష్టం చేశారు.

నాగులపల్లిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అంజయ్య యాదవ్, బైకని శ్రీనివాస్ యాదవ్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) : ఫరూఖ్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో హైదరాబాద్--మహబూబ్‌నగర్--రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యావంతులు ఆలోచనాత్మకంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాలను బేరీజు వేసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి, విద్యతో పాటు వివిధ రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మేలు చేసిందని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, స్థానిక సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ, శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు బిశ్వ రామకృష్ణ, రాధాకృష్ణ, నాయకులు యాదయ్య, పోచయ్య గౌడ్, వెంకటయ్య గౌడ్, నరసింహా, జనార్దన్ గౌడ్, మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, రఘురాం రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, కాటి మల్లేష్ యాదవ్ నాగభూషణం, భరత్, రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2,00,000/- రెండు లక్షల రూపాయల విలువ గల ఎల్వోసీ ని అందజేసిన ఆకపూడి గాంధీ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీకి చెందిన చాగంటి పూల కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,00,000/- రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్వోసీ మంజూరి పత్రాన్ని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి ,నాయి నేని చంద్రకాంత్ రావు, రాధాబాయి మరియు తదితరులు పాల్గొన్నారు

సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం కదిలిన ఇన్ముల్ నర్వ గ్రామ ప్రజలు..

డంపింగ్ యార్డు రద్దు చేసే వరకు జేఏసి తో కలిసి నడుస్తాం.

ఇన్ముల్ నర్వ సర్పంచ్ గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్లు మిట్టు నాయక్, యాదగిరి..

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) : సిద్దాపూర్ డంపింగ్ యార్డు జీవో 641 రద్దుకోసం జేఏసి ఆధ్వర్యంలో 25 రోజులుగా జరుగుతున్న నిరవధిక రిలే నిరాహార దీక్షలకు ఇన్మల్ నర్వ గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలి వచ్చి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్ముల్ నర్వ గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ... సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం సమరశీల పోరాటాలు చేయటానికి సిద్ధంగా ఉన్నామని, జీవో రద్దుఆయ్యేవరకు ఉద్యమానికి మద్దతు గా ఉంటామని తెలిపారు. జేఏసి నాయకుల అడుగు జాడల్లో వాళ్ళు ఇచ్చే కార్యాచరణను చిత్త శుద్ధితో అమలు చేయాలని కోరారు. ప్రజలందరూ కుల మతాలు , పార్టీలకి అతీతంగా జీవో రద్దు కొరకు ఐక్యంగా పోరాడాలి అని కోరారు. ఇన్ముల్ నర్వ మాజీ సర్పంచ్ మిట్టూ నాయక్ మాట్లాడుతూ.... ప్రభుత్వం ఇక్కడి అధికారం పార్టీ నాయకులు ఉద్యమాన్ని చీల్చాలని ఎన్ని ప్రయత్నాలు జిమ్మిక్కులు చేసినా ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ముందు అధికార పార్టీ నాయకులు ఈ ఉద్యమంలో పూర్తిగా ఎందుకు పాల్గొన లేక పోతున్నారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ డంపింగ్ యార్డును రానివ్వబోమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా పోరాటం ఉవ్వెత్తున సాగుతుందని తెలిపారు. జేఏసి తో కలిసి ముందుకు సాగుతామని చెప్పారు.

ఇన్ముల్నర్వ మాజీ సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ... డంపింగ్ యార్డు రద్దుకొరకు నిర్విరామంగా పోరాటం చేస్తున్న జేఏసి నాయకులకు ఉద్యమాభివందనాలు తెలిపారు. ఈ పోరాటం విజయవంతం కావాలని, అవసరమైతే మిలిటెంట్ పోరాటాలు చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డు ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని, ఇది చావు బతుకుల పోరాటం అని మన జీవించే హక్కును హరించే ఈ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (రాణవూ జీూజ) చైర్మన్ రాంబల్ నాయక్, కో చైర్మన్ లు శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య, కో కన్వీనర్ మహేష్, సిద్దాపూర్ గ్రామ జేఏసి అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధరా చారి, నాయకులు నరేందర్ రెడ్డి, మహేష్ , మరియు ఇన్మల్ నర్వ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగుల పరంపర..
రూ. 1.18 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన!

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్, భూదేవి హిల్స్, గోవింద్ హోటల్, ఛత్రపతి శివాజీ నగర్, మహంకాళి నగర్,ఇందిరా నగర్ కాలనీలలో రూ.1 కోటి 18 లక్షల 80 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్, భూదేవి హిల్స్, గోవింద్ హోటల్, ఛత్రపతి శివాజీ నగర్, మహంకాళి నగర్,ఇందిరా నగర్ కాలనీలలో రూ.1 కోటి 18 లక్షల 80 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులు వంటి అభివృద్ధి నిర్మాణం పనులకు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు నేటితో ఉపశమనం లభించింది అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు.సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది.శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, ఆల్విన్ కాలనీ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

శంకుస్థాపన చేసిన కార్యక్రమాల వివరాలు :

మంజూరైన అభివృధి పనుల వివరాలు

1.) తులసి నగర్ కాలనీ లో రూ.12 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

2.) భూదేవి హిల్స్ కాలనీ లో రూ.20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

3.) గోవింద్ హోటల్ చౌరస్తా లో రూ.38.80లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

4) ఛత్రపతి శివాజీ నగర్ కాలనీ లో రూ.15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

5.) మహంకాళి నగర్ కాలనీ లో రూ.10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

6.) ఇందిరా నగర్ కాలనీ లో రూ.23 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సి సి రోడ్డు నిర్మాణం పనులకు.

పైన పేర్కొన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని చైర్మన్తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు , కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పులివెందులలో వైసీపీకి ఎదురుదెబ్బ.. టీడీపీలోకి 20 కుటుంబాలు

-పులివెందులలో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన 20 వైసీపీ కుటుంబాలు

-పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన బీటెక్ రవి

పులివెందుల, జర్నలిస్ట్ డైరీ : స్థానిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీ అధినేత జగన్ సొంత గడ్డ పులివెందులకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరాయి. పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ...

టీడీపీ విధానాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ, పులివెందులలోని ప్రతి వార్డులో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మద్దతుదారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో ఉన్న గీతా కుమారి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. కీలకమైన ఎన్నికల సమయంలో ఈ చేరికలు జరగడం నియోజకవర్గంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

జలవాయు విహార్ కాలనీలో అభివృద్ధి పనుల జోరు..
రూ. 1.33 కోట్లతో సీసీ రోడ్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన!

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీ లో రూ.1 కోటి 33 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్లు, రోడ్డు విభాగిని మరియు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీ లో రూ.1 కోటి 33 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్లు, రోడ్డు విభాగిని మరియు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులు వంటి అభివృద్ధి నిర్మాణం పనులకు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు నేటితో ఉపశమనం లభించింది అని తెలిపారు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు. సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది.
శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, హైదర్ నగర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు , కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూదాన్ భూములు, రీసర్వే, భూ భారతి
పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) అక్టోబర్ 28, :
భూదాన్ భూములు, రీ సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో భూధాన్ భూములు, రీ సర్వే ప్రక్రియ, కోర్టు కేసులు, భూ సేకరణ, జి.ఓం. 59, 76, 118 ల సంబంధిత పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, విజిలెన్స్, ఇంటలిజెన్స్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదిక, భూముల రీసర్వే ప్రక్రియ పురోగతి, న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. యు ఎల్ సి భూములు, జి.ఓ. 59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి సంబంధిత దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతి వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, భూభారతి పెండింగ్ దరఖాస్తులు నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) అక్టోబర్ 28,
భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి., తహసిల్దార్లతో భూ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి సి ఎల్ ఏ ఆదేశాల మేరకు భూదాన్ భూములకు సంబంధించిన దాన పత్రాలు, పంపిణీ పత్రాలను గుర్తించి, భూదాన్ చట్టం ప్రకారం నిర్దేశించిన ఫార్మాట్లలో వివరాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు. భూ సంబంధిత కోర్టు కేసుల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన కౌంటర్లు దాఖలు చేయాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు జిఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాలను సమకూర్చుకొని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. జి.ఓ. నంబర్ 59, 76 లకు సంబంధించి ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భూ భారతి పోర్టల్ ద్వారా అందిన పాత, కొత్త ఫార్మాట్లలోని పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి, సంబంధిత రికార్డుల ఆధారంగా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పాత ఫార్మాట్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నవంబర్ 10వ తేదీలోగా పరిష్కరించాలని తెలిపారు. కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా గణాంక/ప్రణాళిక అధికారి పాపయ్య లతో కలిసి డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య ఆధ్వర్యంలో ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు నిర్వహించిన జనగణన సంబంధిత 2 రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన నిర్వహణకు సంబంధించి శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. జనగణన ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని వివరాలు, రికార్డులతో సిద్ధంగా ఉండాలని, సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ సవాళ్లు.. మంత్రి సత్యకుమార్

-ఓటమిని జీర్ణించుకోలేకే జగన్ హింసను రెచ్చగొడుతున్నారన్న సత్యకుమార్

-నామినేషన్లప్పుడు కనిపించకుండా, ఇప్పుడు సవాళ్లు విసురుతున్నారని విమర్శ

-ప్రజాస్వామ్యవాదిగా మారాలని జగన్‌కు హితవు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున పులివెందులలోనే ఉంటా, ఎవరొస్తారో రండి చూస్తానంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కడప జిల్లాలో, ముఖ్యంగా పులివెందులలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేనాటికి పార్టీ ఎదుర్కొన్న పరాభవాన్ని జీర్ణించుకోలేక, పోలింగ్ నాడు హింసను రెచ్చగొట్టడానికే జగన్ ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.
కడపలో సీన్ రివర్స్..
"నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి కడపలో సీన్ రివర్స్ అయి తాను, తన పార్టీ 'పడక' ఎక్కడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే పోలింగ్ నాడు హింసను రెచ్చగొట్టే దురుద్దేశం ఆయన వ్యాఖ్యలతో స్పష్టమైంది" అని విమర్శించారు. దశాబ్దాలుగా తన కుటుంబం అనుసరించిన హింసా రాజకీయాలనే జగన్ కొనసాగించాలనుకుంటున్నారని, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.
అన్నీ అయిపోయిన తర్వాత ఇప్పుడు చొక్కా మడత పెట్టడంలో ఆంతర్యం ఏమిటి?"నామినేషన్ల సమయంలో ప్యాలెస్‌కు పరిమితమై, విత్ డ్రాయల్స్ సమయంలో ముఖం చాటేసి, అన్నీ అయిపోయిన తర్వాత ఇప్పుడు చొక్కా మడతపెట్టడంలో ఆంతర్యం ఏమిటి?" అని సత్యకుమార్ నిలదీశారు. ఎన్నికలను వాయిదా వేయించడానికి జగన్ చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు అడ్డుకుందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జగన్ తనను తాను సంస్కరించుకుని, ప్రజాస్వామ్యవాదిగా మారే ప్రయత్నం చేయాలని హితవు పలికారు

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

-సాయానికి సిద్ధమన్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

-ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను

-విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం

-ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

-విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ

-తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

-ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు.
ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా
ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.
మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు
తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
అత్యవసర సేవల కోసం అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి
అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు

జైలు నుంచే జెడ్పీటీసీ ఎన్నికల బరిలో వైసీపీ నేత.. ప్రచారంలో భార్య!

-హత్య కేసులో అరెస్టయిన వైసీపీ నేత జైలు నుంచే పోటీ
-తిరుపతి జిల్లా పెళ్లకూరు జెడ్పీటీసీ అభ్యర్థిగా సత్యనారాయణ రెడ్డి
-భర్త తరఫున ప్రచార బాధ్యతలు చేపట్టిన భార్య ప్రభావతమ్మ
-ఓటు వేయాలంటూ జైలు నుంచి ఓటర్లకు లేఖ విడుదల

తిరుపతి, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : తిరుపతి జిల్లాలో ఒక ఆసక్తికర రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. హత్య కేసులో అరెస్టయి ప్రస్తుతం జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ వైసీపీ నేత, స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచారు. నెల్లూరు జిల్లా సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ కమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పెళ్లకూరు జెడ్పీటీసీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.సత్యనారాయణ రెడ్డి తన అనుచరుల ద్వారా జైలు నుంచే నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఆయనతో పాటు ఆయన భార్య ప్రభావతమ్మ కూడా వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు చేయగా, చివరి నిమిషంలో ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో సత్యనారాయణ రెడ్డి పార్టీ అధికారిక అభ్యర్థిగా ఖరారయ్యారు. ప్రస్తుతం ఆయన తరఫున భార్య ప్రభావతమ్మే ఎన్నికల ప్రచార బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

బాలయ్య అనే వ్యక్తి హత్య కేసులో సత్యనారాయణ రెడ్డి నిందితుడిగా

గత నెల తిరుపతి జిల్లాలో జరిగిన బాలయ్య అనే వ్యక్తి హత్య కేసులో సత్యనారాయణ రెడ్డి నిందితుడిగా ఉన్నారు. భూవివాదమే ఈ హత్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ కేసులో ఆయన నాయుడుపేట కోర్టులో లొంగిపోగా, అప్పటి నుంచి నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నారు.

పోలీసుల అనుమతితో ఆయన జైలు నుంచే ఓటర్లకు ఒక బహిరంగ లేఖ విడుదలఈ నేపథ్యంలో, పోలీసుల అనుమతితో ఆయన జైలు నుంచే ఓటర్లకు ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. గత 40 ఏళ్లుగా తాను ప్రజాసేవలో ఉన్నానని, గతంలో సొసైటీ ప్రెసిడెంట్‌గా, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా, మండల అధ్యక్షుడిగా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా తనను గెలిపించాలని, జైలులో ఉన్నప్పటికీ పెళ్లకూరు ప్రజల సంక్షేమం కోసమే తాను పోటీ చేస్తున్నానని ఆయన తన లేఖలో అభ్యర్థించారు

ఆర్నాబ్ తుపాను వేళ అప్రమత్తంగా ఉండాలి...

ప్రభుత్వానికి జగన్ కీలక సూచనలు

-ఆర్నాబ్ తుపానుపై ప్రజలకు మాజీ సీఎం జగన్ హెచ్చరిక
-ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సూచన
-రైతులకు ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
-రంగంలోకి దిగి సేవ చేయాలని వైసీపీ శ్రేణులకు పిలుపు
-తుపాను ధాటికి రద్దయిన 100కు పైగా రైళ్లు, పలు విమానాలు

అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆర్నాబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకిన నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు, ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం ప్రాణనష్టాన్ని నివారించడానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని జగన్ సూచించారు. బాధితుల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి ఆహారం, తాగునీరు, మందులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో రైతులకు అండగా నిలవాలని, వారికి పెండింగ్‌లో ఉన్న ఇన్పుట్ సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైఎస్సార్సీపీ శ్రేణులు తక్షణమే సహాయక, పునరావాస కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు అండగా నిలవాలని జగన్ పిలుపునిచ్చారు. మరోవైపు, ఆర్నాబ్ తుపాను గంటకు 135 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో తీరం దాటింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తుపాను ప్రభావంతో 100కు పైగా రైళ్లు రద్దు కాగా, భోగాపురం విమానాశ్రయానికి చెందిన 28 సర్వీసులతో పాటు, గన్నవరం విమానాశ్రయం నుంచి నడవాల్సిన అన్ని విమానాలను రద్దు చేశారు

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు,అక్టోబర్ 28 జర్నలిస్ట్ డైరీ : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమ ప్రక్రియను విజయవంతం చేసేందుకు నా య ు క ు ల ం ద ర ూ సమన్వయంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కల్వకుర్తి పట్టణం, కల్వకుర్తి, వెల్దండ మండలాల్లోని గ్రామాలు, వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకొని అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదుకు ఎవరూ దూరం కాకుండా క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు.సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రజిని సాయి చందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్,పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు 'భారీ' 'ప్యాకేజి' ప్రకటించిన చంద్రబాబు

-అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీ

-మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇళ్ల నష్టానికి ఆర్థిక సాయం

-వ్యవసాయ, ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ. 35,000 వరకు పరిహారం

-తుఫాను నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక, కేంద్ర బృందాన్ని కోరిన సీఎం

-ప్రతీ బాధితుడికి పారదర్శకంగా సాయం అందిస్తామని సిఎం హామీ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అర్నబ్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని, నష్టపోయిన చివరి వ్యక్తికి కూడా న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తుపాను అనంతర సహాయక చర్యలు, నష్టపరిహారంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుపాను బాధితుల కోసం ప్రభుత్వం భారీ ప్యాకేజీని ప్రకటించింది.

ఇళ్లు, పంటలు, పశువులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని, వీలైనంత వేగంగా పరిహారం అందించి వారిని తిరిగి నిలబెడతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ప్యాకేజీ పారదర్శకంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని సీఎం తెలిపారు. తక్షణ సహాయం కింద తుపాను ప్రభావిత కుటుంబాలకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు.

తక్షణ సహాయం మరియు ఇళ్ల నష్టపరిహారం

తుపాను కారణంగా ఇళ్లలోకి నీరు చేరిన ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం.

మత్స్యకారులు మరియు చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం.

ప్రతి కుటుంబానికి కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ చక్కెర, కేజీ బంగాళదుంపలు ఉచితంగా పంపిణీ.తక్షణ ఖర్చుల కోసం ఒక్కో కుటుంబానికి రూ. 1000 నుంచి గరిష్ఠంగా రూ. 3000 వరకు ఆర్థిక సహాయం.తుపాను కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా. పాక్షికంగా ఇల్లు దెబ్బతింటే రూ. 10,000 ఆర్థిక సహాయం.వ్యాపారాలు, జీవనోపాధికి చేయూత

చిన్న కిరాణా షాపులు, రెస్టారెంట్లు, సర్వీస్ షాపులకు రూ. 25,000. చేతివృత్తుల వారికి జీవనోపాధి నష్టానికి రూ. 25,000. తోపుడు బండ్లకు రూ. 20,000. ఎంఎస్ఎంఈ పరిశ్రమలు (రూ. 40 లక్షల టర్నోవర్ వరకు): రూ. 50,000.

పరిశ్రమలు (రూ. 40 లక్షల నుంచి రూ. 1.5 కోట్ల టర్నోవర్): రూ. 1 లక్ష. పరిశ్రమలు (రూ. 1.5 కోట్ల టర్నోవర్ పైబడినవి): రూ. 1,50,000. దెబ్బతిన్న ద్విచక్ర వాహనానికి రూ. 3000

దెబ్బతిన్న ఆటోకు రూ. 10,000. ఇస్తామని తెలిపారు.

మత్స్యకారులకు నష్టపరిహారం

వలలు పాక్షికంగా దెబ్బతింటే మరమ్మతులకు రూ. 5000, రీప్లేస్‌మెంట్‌కు రూ. 10,000.

మెకనైజ్డ్ కాని బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 20,000. మెకనైజ్డ్ బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 25,000.

చేపల చెరువుల పునరుద్ధరణకు రూ. 18,000.

పశు నష్టపరిహారం..

ఆవు/గేదె మరణిస్తే: రూ. 50,000 దూడలకు: రూ. 25,000గొర్రె/మేక: రూ. 7,500

కోడికి రూ. 100 (ఒక లబ్ధి దారునికి గరిష్ఠంగా రూ. 10,000). పశువుల షెడ్ దెబ్బతింటే: రూ. 5,000/-లు

వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టపరిహారం (హెక్టారుకు)

రూ. 75,000: తమలపాకు

రూ. 35,000: అరటి, పసుపు, యమ్, మిరప, జామ, బొప్పాయి, మామిడి, కాఫీ, యాపిల్ బేర్, సపోటా, కాజు, డ్రాగన్ ఫ్రూట్. రూ. 25,000: పత్తి, వేరుశనగ, వరి, కూరగాయలు, టమాటో, పూలు, ఉల్లి, పుచ్చ, నర్సరీ, దానిమ్మ, కొత్తిమీర. రూ. 25,000: చెరకు (మొదటి పంట) రూ. 15,000, సజ్జ,మినుములు, పెసలు, మొక్కజొన్న, రాగి, కంది, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పొగాకు, జనుము, కొర్ర, సామ.

ఆయిల్ పామ్, కొబ్బరి: ఒక్కో చెట్టుకు రూ. 1500

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా మొదటి ప్రాధాన్యత ప్రాణనష్టాన్ని నివారించడం. అయినప్పటికీ ఐదుగురు మరణించడం బాధాకరం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి" అని అన్నారు. మూడు రోజుల్లో ఎనిమిది సార్లు సమీక్షలు నిర్వహించి, టెక్నాలజీని వాడుకుని అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. తుపాను తీరం దాటిన అయిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు.

రెండు, మూడు రోజుల్లో కోనసీమ, పశ్చిమ గోదావరి మినహా అన్ని జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అన్నారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశామని, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.

తుపాను నష్టంపై కేంద్రానికిప్రాథమిక నివేదిక

తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను కేంద్రానికి పంపి, కేంద్ర బృందాన్ని పంపమని కోరినట్లు తెలిపారు. రేపు, ఎల్లుండి క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధితులకు భరోసా కల్పిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బాధ్యత గల ప్రభుత్వంగా ప్రజల కష్టాల్లో సర్వశక్తులు ఒడ్డి అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు

వైసీపీ 'ఓటు బ్యాంక్' ఇంకా 'తగ్గాలి'.. రాష్ట్రం బాగుపడాలంటే అదే మార్గం...సీఎం చంద్రబాబు

-45 వేల మంది నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

-స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యంగా పనిచేయాలని చంద్రబాబు పిలుపు

-రెబల్స్‌గా పోటీ చేస్తే సహించేది లేదు, అది కూటమి ధర్మానికి విరుద్ధం

-సీట్లు రాని వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ

-'గొడ్డలి పార్టీ' కుట్రలను ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచన

-డబుల్ ఇంజిన్ సర్కారును ట్రిపుల్ ఇంజిన్‌గా మార్చడమే లక్ష్యం

అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : రాష్ట్రంలో వైసీపీ ఓటు బ్యాంకు ఇప్పటికే గణనీయంగా తగ్గిపోయిందని, రాష్ట్రం బాగుపడాలంటే ఆ ఓటు బ్యాంకు మరింత తగ్గాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసమే ఎన్డీఏ కూటమి శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 45 వేల మంది ముఖ్య నేతలు, కార్యకర్తలతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఓటు బ్యాంకు పతనం రాష్ట్ర ప్రగతికి సూచికగా మారాలని ఆకాంక్షించారు.

ఒక తీవ్రవాదిలా "హిట్ అండ్ రన్" తరహా రాజకీయాలు

గొడ్డలి పార్టీ చతికిల పడిందని, ఆ పార్టీ అధినేత ఒక తీవ్రవాదిలా "హిట్ అండ్ రన్" తరహా రాజకీయాలు చేస్తున్నారని, బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని రాష్ట్రంపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఆయన ధ్యాసంతా ప్రజల సంక్షేమంపై కాకుండా, ఆస్తులు కూడబెట్టుకోవడంపైనే ఉందని విమర్శించారు. గొడ్డలి పార్టీ గతంలో చేసిన అరాచకాలు, అకృత్యాలపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కూటమి కార్యకర్తలపై ఉందని దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలను అడ్డుకోవడానికి ఏకంగా 62 పిటిషన్లు వేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, న్యాయస్థానం కూడా వారి కుట్రలను తిరస్కరించిందని అన్నారు.

ఒక తీవ్రవాదిలా "హిట్ అండ్ రన్" తరహా రాజకీయాలు..

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు "సుపరిపాలన" అనే నినాదాన్ని విశ్వసించి ఎన్డీఏ కూటమికి చరిత్రాత్మక విజయాన్ని అందించారని చంద్రబాబు అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కేవలం 28 నెలల కాలంలోనే తమ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించడం, పేదలకు ఇళ్ల పట్టాలు, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం, గుంతలు లేని రోడ్ల నిర్మాణం వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం బటన్లు నొక్కడంపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టలేదని ఎద్దేవా చేశారు. క్యాలెండర్ ప్రకారం సంక్షేమ ఫలాలను అందిస్తుండటంతో ప్రజల్లో ప్రభుత్వం పట్ల పూర్తి సంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యత అత్యంత కీలకమని చంద్రబాబు ఉద్ఘాటించారు. మూడు పార్టీలు ఉన్నప్పుడు కొన్ని చిన్న చిన్న సమస్యలు సహజమని, అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం వాటిని అధిగమించాలని సూచించారు. పార్టీ అధినేతలు చర్చించి ఖరారు చేసిన అభ్యర్థుల విజయానికే అందరూ కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు. ఎవరైనా రెబల్స్‌గా, స్వతంత్రులుగా పోటీలో నిలవడం కూటమి ధర్మానికి పూర్తిగా విరుద్ధమని, అలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. టికెట్లు ఆశించి భంగపడిన వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు, ఇతర అవకాశాల ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివరణ...

ప్రస్తుతం అర్నబ్ తుపాను రూపంలో రాష్ట్రం ఒక విపత్తును ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితిని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివరించినట్లు తెలిపారు. ఒకవైపు తుపాను సహాయక చర్యలను సమీక్షిస్తూనే, మరోవైపు పార్టీ వ్యవహారాలకు, ఎన్నికల వ్యూహాలకు సమయం కేటాయిస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ బలంగా ఉందని, ఇప్పుడు స్థానిక సంస్థలను కూడా గెలుచుకుని "ట్రిపుల్ ఇంజిన్ సర్కార్" ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు.. ఇలా అన్నీ కైవసం చేసుకుని, 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్ల శాతాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. సమయం తక్కువగా ఉన్నందున అత్యంత చురుగ్గా పనిచేసి కూటమి అభ్యర్థుల గెలుపును ఖరారు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్న చంద్రబాబు...

-మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా
-ఏపీని అతలాకుతలం చేసిన అర్నాబ్ అతి తీవ్ర తుఫాన్
-కోస్తాంధ్ర అతలాకుతలం..
-రేపటి నుంచి సీఎం క్షేత్రస్థాయి పర్యటన
-తుపాను నష్టంపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : 'అర్నబ్' తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. తీవ్రమైన ఈదురుగాలులు, కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో తుపాను ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. గంటకు 135 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు వేలాది విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో లక్షలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు 70 వేల హెక్టార్లలో వరి పంట, 10 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రోడ్లు ధ్వంసమై, రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది.

తుపాను నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

తుపాను నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు బియ్యం, నిత్యావసరాలతో కూడిన సహాయ ప్యాకేజీని అందించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు ముఖ్యమంత్రి రేపు, ఎల్లుండి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. బాధితులను పరామర్శించి, పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షించనున్నారు

అర్నబ్ తుపాను..రైతుల కోసం ప్రత్యేక చర్యలు.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

-అర్నబ్ తుపాను నేపథ్యంలో వ్యవసాయ శాఖ పూర్తి అప్రమత్తం
-రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశం
-క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని సూచన
-అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో పరిహారం అందించాలని స్పష్టం
-కష్టకాలంలో రైతులకు ధైర్యం చెప్పడమే అధికారుల ప్రథమ కర్తవ్యం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అర్నబ్ తుపాను ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర రైతాంగానికి ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. పంట నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యమని, ఈ కష్టకాలంలో రైతులకు పూర్తి అండగా నిలవాలని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన పంటల సంరక్షణ, పునరుద్ధరణ, సహాయక చర్యలపై ఈ సమావేశంలో క్షుణ్ణంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ..

గ్రామస్థాయి వ్యవసాయ సహాయకుడి నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిర్దేశించారు. "కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, ఇప్పటికే కోసి కళ్లాల్లో ఉంచిన ధాన్యం నిల్వలు దెబ్బతినకుండా రైతులకు తక్షణమే అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలు అందించాలి. వాతావరణం అనుకూలించిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, నేరుగా రైతులతో మాట్లాడి వారిలో భరోసా నింపాలి" అని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా నీట మునిగిన పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేయడం, పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా,

పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, కచ్చితంగా జరగాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గ్రామాల వారీగా, పంటల వారీగా, రైతుల వారీగా నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. ఆ తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి రైతు సమస్యపై సానుకూలంగా స్పందించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావు ఇవ్వరాదని హెచ్చరించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు జిల్లా యంత్రాంగంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించాలని సూచించారు.

"నష్టపోయిన రైతుల వివరాలను త్వరితగతిన సేకరించాలి.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో నష్టపరిహారం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయండి. కష్టకాలంలో రైతులకు ధైర్యాన్ని నింపడమే అధికారుల ప్రథమ కర్తవ్యం.ప్రభుత్వ యంత్రాంగమంతా సమష్టిగా పనిచేసి రైతులను ఆదుకోవాలి" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీ, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీనివాసులుతో పాటు ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

-సాయానికి సిద్ధమన్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
-ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
-విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
-ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
-విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
-తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
-ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా

ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.

మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు

తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అత్యవసర సేవల కోసం అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి

అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు

జైపూర్ ఎస్టీపీపీ పవర్ ప్లాంట్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) అక్టోబర్ 28

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎస్టీపీపీ పవర్ ప్లాంట్ అలాగే పరిసర ప్రాంతాల్లో ఆక్టోపస్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఆధ్వర్యంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఆక్టోపస్ సీనియర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో అత్యాధునిక ఆయుధాలతో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు.ఉగ్రవాద సంస్థలు రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన విద్యుత్ ప్రాజెక్టులు,భారీ పరిశ్రమలు వంటి కీలక మౌలిక వసతులను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. ఇలాంటి కీలక ప్రాజెక్టులపై ఉగ్రవాదులు లేదా అసాంఘిక శక్తులు దాడికి పాల్పడిన సందర్భంలో,అక్కడి భద్రతా సిబ్బంది సమర్థవంతంగా స్పందించకపోతే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి,దాడిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే మాక్ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

మాక్ డ్రిల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించే విధానంపై సిబ్బందికి అవగాహన కలుగుతుందని, భద్రతా ఏర్పాట్లలో ఉన్న లోపాలను ముందుగానే గుర్తించి సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని సీపీ తెలిపారు. అలాగే స్థానిక పోలీసులు, ప్లాంట్ భద్రతను పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది,ప్రాజెక్ట్ నిర్వహణ సిబ్బంది మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఇటువంటి మాక్ డ్రిల్స్ ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఈ మాక్ డ్రిల్‌లో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,జైపూర్ ఏసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, జైపూర్ సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్, స్థానిక పోలీసు సిబ్బంది,ఆక్టోపస్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ సిబ్బంది, ప్లాంట్ భద్రతను పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్నాబ్ తుపాను బీభత్సం.. సహాయక చర్యలపై మంత్రులు నారాయణ, ఆనగాని టెలీ కాన్ఫరెన్స్

-అర్నాబ్ తుపానుపై మంత్రులు నారాయణ, ఆనగాని సమీక్షలు
-ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం
-చెట్లు తొలగించాలని, నీరు నిలవకుండా చూడాలని సూచన

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అర్నాబ్ అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. మంత్రులు నారాయణ, ఆనగాని సత్యప్రసాద్ వేర్వేరుగా అధికారులతో సమీక్షలు నిర్వహించి, జనజీవనానికి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, తుపాను ప్రభావిత ప్రాంతాల మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారులపై కూలిన చెట్లను యంత్రాల సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. బలమైన గాలులకు ప్రమాదకరంగా మారే హోర్డింగుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, డ్రెయిన్లలో నీరు నిలిచిపోకుండా ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి కాలుష్యం వంటివి తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

రెవెన్యూ అధికారులతో మంత్రి ఆనగాని సత్యప్రసాద్ టెలీ కాన్ఫరెన్స్

మరోవైపు, రెవెన్యూ శాఖ మంత్రి ఆనగాని సత్యప్రసాద్ కూడా రెవెన్యూ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు

విద్యార్థులకు యూనిఫామ్‌లు

షూస్ పంపిణీ

చండూర్ అక్టోబర్ 28 జర్నలిస్ట్ డైరీ :

చండూరు మండలం గుండ్రపల్లి గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు రెండవ జత స్కూల్ యూనిఫామ్‌తో పాటు షూస్, సాక్స్‌లను బుధవారం నాడు ఘనంగా పంపిణీ చేశారు..పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. రమేష్,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కురుపాటి రఘునమ్మ, విద్యార్థులకు అందజేశారు..ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కురుపాటి రఘునమ్మ మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కే. సత్యవతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు...

ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన పొదిలి జడ్పీటీసీ కూటమి అభ్యర్థి మద్దుల శ్రీను

-అన్నవరం శివాలయంలో పూజలు..

పొదిలి, మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదిలి జడ్పీటీసీ కూటమి అభ్యర్థి మద్దుల శ్రీను బుధవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అన్నవరం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్న అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ తరఫున కాటూరి పెద్దబాబు, జనసేన తరఫున హాల్ చల్ జహీర్, బీజేపీ తరఫున విజయలక్ష్మి మద్దుల శ్రీనుకు తమ పార్టీల కండువాలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పొదిలి జడ్పీటీసీ అభ్యర్థి మద్దుల శ్రీనును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో మండలం లోని వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి, కూటమి విధానాలను, అభ్యర్థి చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అన్నవరం శివాలయంలో పూజల అనంతరం ప్రారంభమైన ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని మద్దుల శ్రీనుకు మద్దతుగా నినాదాలు చేశారు. రానున్న రోజుల్లో పొదిలి మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు కూటమి శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో కాటూరి పెద్దబాబు, పండు అనిల్, హాల్ చల్ జహీర్, రసూల్, వాకా వెంకటరెడ్డి, యాసిన్, గోగినేని వెంకటరావు, నాగార్జున, మదర్ వలి, విజయలక్ష్మితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రూ.2,00,000/- రెండు లక్షల రూపాయల విలువ గల ఎల్వోసీ ని అందజేసిన ఆకపూడి గాంధీ

రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 28 జర్నలిస్ట్ డైరీ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీకి చెందిన చాగంటి పూల కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,00,000/- రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన ఎల్వోసీ మంజూరి పత్రాన్ని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి ,నాయి నేని చంద్రకాంత్ రావు, రాధాబాయి మరియు తదితరులు పాల్గొన్నారు

తీరం దాటిన ఆర్నబ్ తీవ్ర తుపాను..

ఏపీ కోస్తాలో కుండపోత వర్షాలు

- -యానాం సమీపంలో తీరాన్ని దాటిన అర్నాబ్ తుఫాను
- -తీరం దాటాక బలహీనపడినట్లు ప్రకటించిన వాతావరణ శాఖ
- -ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు.. విశాఖలో అత్యధికం
- -ఏపీ, ఒడిశాలో 1.8 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- -మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం

అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' అతి తీవ్ర తుఫాను బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. సుమారు ఆరు గంటలకు పైగా కొనసాగిన తీరం దాటే ప్రక్రియతో కోస్తాంధ్ర అతలాకుతలమైంది. విధ్వంసకర గాలులు, కుండపోత వర్షాలతో జనజీవనం స్తంభించింది. తీరం దాటిన తర్వాత తుఫాను బలహీనపడినప్పటికీ, దాని ప్రభావంతో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి.
భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం,
ఈ తుఫాను యానాం సమీపంలో తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 125-135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, గరిష్ఠంగా గాలి వేగం 150 కిలోమీటర్ల వరకు నమోదైందని తెలిపారు. తీరం దాటిన అనంతరం ఉదయం 8:30 గంటలకు ఇది అతి తీవ్ర తుఫాను నుంచి తీవ్ర తుఫానుగా బలహీనపడింది. ఉదయం 9:50 గంటల సమయానికి తీరం దాటే ప్రక్రియ పూర్తిగా ముగిసిందని, తుఫాను కేంద్రం నర్సాపురానికి 20 కి.మీ తూర్పున, యానాంకు 40 కి.మీ నైరుతిన కేంద్రీకృతమై ఉందని ఐఎండీ తన బులెటిన్‌లో పేర్కొంది.
కోస్తాంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
తుఫాను ప్రభావంతో కోస్తాంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8:30 గంటల సమయానికి అత్యధికంగా విశాఖపట్నంలో 315 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, విజయనగరంలో 301 మి.మీ, అనకాపల్లిలో 275 మి.మీ, శ్రీకాకుళంలో 257 మి.మీ, కృష్ణా జిల్లాలో 223 మి.మీ వర్షం కురిసింది. పొరుగు రాష్ట్రమైన ఒడిశాలోని కోరాపుట్‌లో 188 మి.మీ, గంజాంలో 161 మి.మీ వర్షపాతం నమోదైంది.
ముందుజాగ్రత్త చర్యగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు
అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో తీరప్రాంతాల నుంచి 1.80 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బలమైన గాలుల కారణంగా అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోయి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, రైళ్లు, విమాన సర్వీసులపై ప్రభావం పడింది. విశాఖపట్నం, విజయవాడకు పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు

ఏపీకి మరో 7 రోజుల పాటు భారీ వర్ష సూచన...

అర్నబ్ తుపానుతో ఇప్పటికే కుండపోత..

- -అర్నబ్ తుపాను ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు
- -రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన
- -కోస్తాంధ్ర, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- -తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో బలమైన గాలులు
- -పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో కుండపోత వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. తీరం వెంబడి గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.
ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్న సీఎం
ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉందని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, రాయలసీమలో రాబోయే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది

బాలుడిని బలిగొన్న ప్రహరీ గోడ..తల్లిదండ్రులకు తీరని శోకం

- -విషాదాన్ని మిగిల్చిన ఆర్నబ్ తుఫాన్!
- -తెనాలి మండలం గుడివాడ గ్రామంలో విషాదఛాయలు
- -మృతుడు గ్రామానికి చెందిన చింతలపూడి 11 ఏళ్ల చిన్నారి దేవాన్ను

తెనాలి,గుంటూరు,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : గుంటూరు జిల్లాలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. భారీ వర్షం కారణంగా పాత ప్రహరీ గోడ కూలి 11 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జరిగిన ఈ విషాద ఘటన..ఆ కుటుంబాన్ని తీరని శోక సంద్రంలో ముంచింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భారీ వర్షానికి ఒక్కసారిగా కూలిబాలుడిపై పడిన పాత ప్రహరీ గోడ
ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..గుంటూరు జిల్లా తెనాలి మండలం గుడివాడ గ్రామానికి చెందిన చింతలపూడి దేవాన్ను (11) వర్షాల కారణంగా ప్రమాదానికి గురయ్యాడు. ఇంటి పక్కనే ఉన్న పాత ప్రహరీ గోడ భారీ వర్షానికి ఒక్కసారిగా కూలి బాలుడిపై పడింది. దీంతో గోడ శిథిలాల కింద చిక్కుకున్న దేవాన్ను అక్కడికక్కడే మృతిచెందాడు.

బాలుడు కనిపించకపోవడంతో ఆందోళన...
రాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో బాలుడు గోడ కింద చిక్కుకున్న విషయాన్ని వెంటనే ఎవరూ గుర్తించలేక పోయారు. తల్లిదండ్రులు బాలుడు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. వర్షం తగ్గిన తర్వాత అతడి కోసం వెతకగా, కూలిన గోడ కింద విగతజీవిగా కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రమాదకరమైన గోడలకు దూరంగా ఉండాలని అధికారుల హెచ్చరిక...
భారీ వర్షాల సమయంలో పాత ప్రహరీ గోడలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల సమీపంలో ఉండటం ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరమైన గోడలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465